# భక్తవత్సలుడు

రాజు బయల్దేరిన అరగంటదాకా చేస్తున్న పనినే సాగదీసి, ఆ పైన దస్త్రం కట్టేసి ఇంటికి బయల్దేరాడు సుబ్బారావు. రాజుతో ఇంటివైపు నడవడం ఇష్టంలేదు సుబ్బారావుకి. అందుకనే రాజును వెళ్లనిచ్చి బయల్దేరాడు. ఇంకా ఆకాశంలో సూర్యుడున్నాడు. అతని కిరణాలు వేడిగా ఉన్నాయి. అవి సుబ్బారావుని తాకుతున్నాయి. పంచ కొసతో నుదుట పట్టిన చమట తుడుచు కొంటూ నడుస్తున్నాడు సుబ్బారావు. కాస్సేపటికి సూర్యుడు ఎర్రబారి పోతాడు. ఒకరోజు "కర్మ సాక్షి రోజంతా జనం చేసిన పాపాలు చూసి చూసి కోపంతో కందగడ్డలా ఎర్రబడి పోయాడు" అన్నాడు సుబ్బారావు రాజుతో.

దానికి రాజు నవ్వి "కామాతురుడైన సూర్యుడు చీకటి పడకుండానే పశ్చిమ దిశాంగన అనే వెలయాలి ఇంటికి పోతూ ప్రజలు తన దుర్నడతని గమనిస్తున్నారన్న కోపంతో మొహం చెండు కొంటున్నాడు" అన్నాడు.

"నీవన్నీ విపరీత వాదనలే! పశ్చిమ దిశాంగన వెలయాలా? నువ్వు తప్ప ఎవరూ అల్లా అనలేదు!" అన్నాడు సుబ్బారావు కోపంగా.

"సాయంత్రాలు సూర్యుడిని, పొద్దున్న చంద్రుడిని తన ఇంటికి ఆహ్వానించే స్త్రీ వెలయాలు కాదా?' అన్నాడు నవ్వుతూ రాజు.

రాజు సూర్యుడిని, పశ్చిమాన్ని మాత్రమే అంటే సుబ్బారావు బాధ పడకపోవును, రాముడిని, వెంకటేశ్వరుడిని కూడా వేళాకోళం చేస్తూ మట్లాడ్తాడు. అటువంటి వాడితో స్నేహం చెయ్యడం తనకి ప్రమాదం అని మానేసాడు. నిన్నటికి నిన్న టౌనుహాల్లో రాముడు దేవుడా? కాదు! అంటూ మైకుపట్టుకొని ఉపన్యసించాడు. టౌను హాలుకి సుబ్బారావు యిల్లు దగ్గర. ఆ పాపపు మాటలు తన చెవుల బడకుండా రాజు ఉపన్యాసం ఇస్తున్నంత సేపు సుబ్బారావు భజన చేసాడు.. అంజనేయ దండకం చదివి హనుమంతుడికి కోపం రాకుండా చూసుకొన్నాడు. రాజు ఉపన్యాసం వినడానికి వెళ్లేజనాన్ని చూస్తే సుబ్బారావుకి జాలి. దేవుడు భక్తవత్సలుడే అయినా పాపి భయంకరుడు కదా!

సుబ్బారావు నడుస్తూ రోడ్డు రెండుగా చీలిన చోటికి వచ్చాడు. ఒక రోడ్డు బజారు గుండా తన యింటికి పోతుంది. రెండో రోడ్డు మీద రాజు యిల్లుంది. రాజు సుబ్బారావు ఒకే ఆఫీసులో పన్చేస్తూ నువ్వు అని పిలుచుకొనే అంత పరిచయం ఉన్న స్నేహితులు.

కాని వయస్సుతో సుబ్బారావు భక్తి వైపు, రాజు నాస్తికత్వం వైపు మొగ్గారు. తమ దార్లు వేరయ్యాయి. ఇద్దరు రెండో వారిని తమ మార్గంలోకి తిప్పుకోవాలని ప్రయత్నించి విఫలులయ్యారు. ఆ దార్లు చీలిన చోట నిలబడి సుబ్బారావు ఆలోచనలో పడ్డాడు.

సుబ్బారావుకి పెళ్లయి పదిహేను సంవత్సరాలైంది. కొడుకు పుట్టి తొమ్మిది సంవత్సరాలైంది. సరిగ్గా పది సంవత్సరాల క్రితం, సంతానం కోసం ఎన్నో ప్రయత్నాలు చేసి చివరిసారి ఆంజనేయుడికి తమలపాకులతో పూజ చేయించాడు. తరువాత సంవత్సరానికి ఆంజనేయ ప్రసాద్ పుట్టాడు. అందుకే ఆంజనేయుడంటే గురి. ఆ దేవుడి కోపం అంటే, భయం.

రాజు, సుబ్బారావుకి పెళ్లయిన అయిదు సంవత్సరాల దాకా పిల్లలు కలగకపోతే డాక్టరుని సంప్రదించమని సలహాఇచ్చాడు. సుబ్బారావు నష్టమే ముందని డాక్టర్ని సంప్రదిస్తే, అతని భార్యకి చిన్న శస్త్ర చికిత్స చెయ్యాలని చెప్పాడు డాక్టరు. సుబ్బారావు భార్య ఆపరేషన్ చేయించుకొంది. తరువాత ఏడాదికి కొడుకుని కంది. ఆ పిల్లాడే ఆంజనేయ ప్రసాద్.

సుబ్బారావు ఆంజనేయ స్వామి మహిమని తెగపొగుడుతుంటే రాజు "తనే పిల్లలు కనని దేవుడు నీ చేత కనిపించడమేమిటోయి! నువ్వు, చెల్లాయిని డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్లకపోతే, మీ ప్రసాద్ పుట్టేవాడే కాదు. ఆ ఘనత శాస్త్రానిది కాని గుళ్లో విగ్రహానిది కాదు" అన్నాడు.

"దేవుడే నీ చేత నాకా విషయం చెప్పించాడు. ఆ దేవుడే నన్ను ఆ మాట వినేలా చేసాడు. అంతకు ముందు నువ్వు అన్నావా? నేను విన్నానా? ఆ రోజుకి నా భక్తి పరిపక్వమైంది. ఆ డాక్టరే మరొకరికి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేసాడు. కాని ఏమైంది? ఏడాది తిరక్కుండా పిల్లాడు పుట్టాడు. దేవుడు నిర్ణయిస్తే శాస్త్రం అడ్డలేదు" సుబ్బారావు కొట్టి పారేసాడు.

సుబ్బారావు ఆలోచనలనుంచి తేరుకొని కాలవ గట్టు వెంబడిపోయే రోడ్డు తీసుకుని రాజింటి మీదుగా పోవడానికి నిర్ణయించుకొన్నాడు. ఆరు నెలల క్రితం వరకు అతనూ, రాజూ, రోజూ అటువేపుగా నడిచేవారు ఆఫీసు వదలగానే. కాని రాజు మరీ నాస్తికత్వం అవలంబించడమే కాకుండా, ప్రచారం చెయ్యటంలోకి దిగాడు. బహిరంగంగా దేవుడితో తలపడటం మొదలు పెట్టాక, సుబ్బారావు వద్దని సలహా యిచ్చి ఫలితం లేక దూరంగా ఉండటం మొదలు పెట్టాడు. ఆరు నెలల నుంచి అతని దారి వేరైంది. ఈ రోజు పాత దారిన పోవాలనుకొన్నాడు. ఎండ వేడిగా ఉండటం, బజారులో కన్నా కాలవ పక్కన చల్లగా ఉండటం ఒక కారణం. కాని అతని మనస్సులో మరో విషయం పట్ల కుతూహలం ఉంది. క్రితం రోజు, రాజు రాముడిని దేవుడు కాదని ఉపన్యసించాడు, భగవంతుడు

భక్తవత్సలుడే గాక పాపిభయంకరుడు కదా! దాని ఫలితం రాజు ఈ రోజో మరో రోజో పొందాలి. రాజు ఇంటి మీదుగా పోయి, అతనికి ఏమైనా కీడు జరిగిందేమో తెల్సుకోవాలి. కాని రాజుని అడిగి కాదు. ఆ యింటి వాతావరణం గమనించి తెలుసుకోవాలి.

సుబ్బారావు కాలవ గట్టు పక్కగా నడుస్తున్నాడు. కొంత దూరం పోయేసరికి అక్కడ జనం గుంపుగా నిలబడి ఏదో జరిగినట్టు చెప్పు కొంటున్నారు. సుబ్బారావు ఆ గుంపులోకి ప్రవేశించి "ఏం జరిగింది?" అని అడిగాడు.

అందరు తలో మాట చెప్పారు. "నే సెప్తాను బాబుగారికి మీరుండండ హె" అన్నాడు ఓ గిరజాల యువకుడు. గోచీ మీద నల్ల వల బనియను వేసుకున్నాడు. చేతిలో చేపలు పట్టే గాలం ఉంది.

"అది కాదండయా! నానేమో ఇక్కడ కూసుని తాపీగ్గా సుట్టముక్క కాల్చుకుంటూ సేపలడ్తున్నా నండె. అప్పుడండయ్యా ఓ కుర్రోళ్ల గుంపొచ్చి కాలువలో ఈద్దారి అనుకొంటూ దిగారయ్యా. కుర్రోళ్లు కాస్సేపు బుద్ధిగా ఈతలు కొట్టారయ్యా. ఇంతలో ఇటుకేసో రాదారి పడవ వత్తే దాని ముట్టుకొని రావాలని పందా లేసుకొన్నారయ్యా! నాను సూత్తు ఉన్నాను. పిల్లోళ్లు సేపల్లా ఈదుకొంటూ పోయారు. సూడ్డానికి మాసర్దాగా అనిపించి గాలం నేలమీద పెట్టి సూత్తున్నాను. అంతేనయ్యా - ఇద్దరు చిన్నోళ్లు పడవకిందకెళి పోయారు. పడవ కలాసులు సూసుకోలేదు. నేను యెంటనే జామ్మని నీటిలో కురికేసి మునకలేత్తున్న కుర్రోళ్ల నిద్దర్ని పైకెత్తి నా నడుం గట్టిగా వాటేసుకోండని సెప్పి ఈదుకొంటూ ఒడ్డుకి సేరా. తమాసా ఏంటంటే అయ్యా, తీరా సూత్తే అందులో ఓ కుర్రోడు అల్లదిగో ఆ డాబా ఇంటి కుర్రోడు. నాను రోజూ సూసేవోడే" అని చెప్తూ రాజు ఇంటికేసి చూపించాడు. దైవదూషణ ప్రభావం అనుకొన్నాడు సుబ్బారావు.

సుబ్బారావు ఊహించిందే జరిగింది! దైవదూషణ పాపం అని రాజుకీపాటికి అర్థమై ఉండాలి. తనోసారి రాజుని హెచ్చరించాలి అనుకొంటూ సుబ్బారావు రాజింటికి వెళ్ళాడు. రాజు, చుట్టు పట్ల ఇళ్లవాళ్లతో తన కొడుక్కి జరిగిన ప్రమాదం గురించి మాట్లాడ్తున్నాడు. సుబ్బారావును చూసి వీధి గుమ్మం దగ్గరకువచ్చి, "ఇంటికి వెళ్లివచ్చావా సుబ్బారావు? నన్ను పలకరించి పోదామని వచ్చావా? రా లోపలికి రా! నిజమైన స్నేహితుడివి కనుక సానుభూతి చెప్పడానికి వచ్చావు. ఇల్లాంటి పరిస్థితుల్లో మీ యింటికి రావటానికి నేను తటపటా యిస్తుంటే నువ్వు వచ్చావు! నీది మంచి మనస్సు. నీ స్థాయికి నేనెదగ లేదు!" అన్నాడు రాజు సుబ్బారావు చేతులు పుచ్చుకొని, మనస్ఫూర్తిగా.

సుబ్బారావుకి రాజు మాట్లాడ్తున్నది అర్థంకాలేదు. ఇల్లాంటి పరిస్థితుల్లో రాజు మా యింటికి ఎందుకు రావాలనుకొన్నట్టు? దానికి అతను తటపటా యించటం ఎందుకు? పిల్లాడు జడుసుకొన్నాడా? ఆంజనేయుడి కుంకుమ కోసమా? సుబ్బారావుకి అర్థం కాలేదు. కాని తన మనసులో మాట నెమ్మదిగా బయటకు చెప్పాడు.

"నేనింకా ఇంటికి వెళ్లలేదు. వెళ్ళి ఉంటే నిన్న ఆంజనేయుడికి పూజచేసిన కుంకుమ తెచ్చి మీ అబ్బాయి నుదట పెట్టుండేవాడిని. మీ అబ్బాయి  కాలవలో మునిగి అదృష్టం కొద్దీ బతికి బయట పడ్డట్టు విని వచ్చాను. దేవుడు నీకు అవకాశం ఇచ్చాడు. మనస్సు మార్చుకోడానికి. నిప్పుతోను దేవుడి తోను చెలగాటం మంచికాదు. మనం చాలా అల్పులం. దేవుడిని భక్తితో సేవించు కోవాల్సిన వాళ్లం. ఆ భక్తవత్సలుడి కరుణ కాశపడాల్సిన వాళ్లం రావణాసురుడంతటి వాడే ఎదురించి నిలవలేక పోయాడు. గుర్తుంచుకో, నేను వెళ్తాను. నువ్వు మారితే మళ్ళీ వస్తాను" అని చెప్పి సుబ్బారావు రాజు చెప్తున్నది వినిపించు కోకుండా ముందుకు నడిచాడు. భక్తులు, దేవుడిపై విశ్వాసం లేనివారికి, దుష్టులకి దూరంగా ఉండాలి.

సుబ్బారావు ఇంటికి చేరేసరికి భార్య ఎదురు వచ్చి, "జరిగింది విన్నారా? ఎంత ప్రమాదం తప్పి పోయిందో!' అంది ఆమె మాటల్లో చిన్న వణుకు, సన్న ఏడుపు మిళితమై ఉన్నాయి.

"రాజు కొడుకు విషయమేనా! విన్నాను" అన్నాడు సుబ్బారావు.

"వాడితో పాటు మన ఆంజనేయ ప్రసాద్ కూడా ఈతకు వెళ్తాడు" అంది ఆమె. ఆ వార్త భర్తకు త్వరగా చెప్పి బరువు దించుకొంది.

"మన వాడికేం ప్రమాదం జరగలేదుకదా," అని కంగారుగా అడిగాడు.

"జరిగింది. కాని భగవంతుడు రక్షించాడు."

"భగవంతుడు భక్త వత్సలుడు" అన్నాడు సుబ్బారావు తేరుకుని.

"మన పిల్లవాడికి అసలు ప్రమాదం జరగటం ఆశ్చర్యం!" అంది ఆమె భక్తుల పిల్లలకి ప్రమాదం జరగటం నమ్మశక్యం కాని విషయం అన్న ధోరణిలో. సుబ్బారావు అరక్షణం ఆలోచించాడు. సమాధానం దొరికింది. ఆ "రాజు కొడుకుతో కలిసి ఈతకు వెళ్లినందుకు, ఇనుముతో కూడిన అగ్నికి సమ్మెట పోటులు తప్ప నట్టు మన వాడికి ప్రమాదం జరిగింది. కాని ఆ దయామయుడికి మనకి మనస్తాపం కలిగించటం ఇష్టం లేదు. అందుకే మన ప్రసాద్ కోసం ఓ మనిషిని నీట్లోకి దూకించి రక్షించాడు. పూలతో బాటు నార కూడ నెత్తికెక్కినట్లు మన ప్రసాద్‌తో ఈతకు వెళ్లడం అనే సుకృతం వల్ల రాజు కొడుకు కూడా రక్షింపబడ్డాడు" అన్నాడు సుబ్బారావు ధృడ విశ్వాసంతో.

సుబ్బారావు భార్య సుబ్బారావుతో ఏకీభవించింది. "మన ప్రసాద్‌ని వాళ్ల ఇంటికి ఇంక పంపను" అంది.